క్లుప్తంగా

నేడు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ రాక

ఎల్కతుర్తి : కరీనంగర్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ శనివారం రానున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి, పైడిపల్లి పృథ్వీరాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లి, ఎల్కతుర్తి మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవలే మృతి చెందిన కుటుంబాలను శనివారం పరామర్శించనున్నట్లు వారు పేర్కొన్నారు.

ముళ్లపొదల తొలగింపు



నడికూడ: మండలంలోని చౌటుపర్తి నుంచి చర్లపల్లి మార్గంలో తుమ్మ చెట్లు పెరిగి రోడ్డు వెంట పోయే వాహనాలకు ఆటంకంగా ఉన్నట్లు స్థానికులు ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం ఎంపీఓ ఆదేశాల మేరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుమ్మ చెట్లు, ఇతర ముళ్లపొదలను గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి, శాయంపేట, పెద్దకోడెపాక, కొప్పుల, ప్రగతి సింగారం గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ చందూలాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులో భాగంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

దామెర : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నెలవారి మరమ్మతులు నిర్వహించనున్నందున శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ గుర్రం రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలి పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. దామెర, ల్యాదెళ్ల, వెంకటాపూర్, సింగరాజుపల్లి, ఒగ్లాపూర్, తక్కళ్లపహాడ్, ముస్త్యాపల్లి గ్రామాల వ్యవసాయ, గృహ, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఐనవోలు: ఐనవోలు, కొండపర్తి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ సురేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐనవోలు సబ్ స్టేషన్ పరిధిలోని ఐనవోలు, లక్ష్మీపురం, ఒంటిమామిడిపల్లి, నాగపురం, పున్నేలు, సింగారం, కొండపర్తి సబ్‌స్టేషన్ పరిధిలోని కొండపర్తి, ముల్కలగూడెం, నర్సింహులగూడెం, భట్టుపల్లి గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. రైతులు, విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గుంతలు పూడ్చిన పోలీసులు



వేలేరు : మండల కేంద్రం నుంచి కొత్తకొండ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో ఎల్లమ్మ వాగుపై నిర్మిస్తున్న వంతెన, బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదు. ఇటీవలే కురుస్తున్న వర్షాలకు ఆ దారి వెంట భారీగుంతలు ఏర్పడ్డాయి. ప్రయాణికుల ఇబ్బందులు గమనించిన స్థానిక ఎస్సై సురేశ్ మండలంలోని పీచరకు చెందిన వెంకట శ్రీ స్టోన్ క్రషర్ యాజమాన్యంతో మాట్లాడి గుంతల్లో మట్టి పోయించి గుంతలు పూడ్చి వేయించారు. అలాగే అదే దారిలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు ఎస్సైకి, స్టోన్ క్రషర్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

సంగెం: ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని.. ఈ కెమెరాలతో నేరాలు అదుపులో ఉంటాయని మాదిరెడ్డి రాకేశ్‌రెడ్డి అన్నారు. గీసుకొండ మండలంలోని బొడ్డు చింతలపల్లిలో తన సొంత ఖర్చులతో 15 సీసీ కెమెరాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామంలో ఏమైన అవాంఛనీయ సంఘటనలు జరిగే వెంటనే నిందితులు గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వీలు కలుగుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కల్యాణి, మాజీ సర్పంచ్‌లు యుగేందర్, హరికృష్ణ, గ్రామస్తులు మోహన్, భాస్కర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదకరం.. పచ్చని చెట్లు



ఇరువైపులా పెరిగిన పచ్చని చెట్లు



రోడ్డుకిరువైపులా గుల్‌మోహర్ చెట్లు

- అవెన్యూప్లాంటేషన్‌తో ఊరికే సింగారం
- రోడ్డుకిరువైపులా చెట్లు
- మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్న ముస్త్యాలపల్లి

నడికూడ : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన హరితహారంలో భాగంగా మొక్కలు నాటి పచ్చదనం కనిపించాలనే లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామం. గ్రామ రహదారికి ఇరువైపులా పచ్చనిచెట్లు బాటకు సింగారంగా ఉన్నాయి. పరకాల–హుజూరాబాద్ ప్రధాన రహదారి నుంచి గ్రామంలోకి పోయే రోడ్డు సుమారు 2 కిలోమీటర్ల మేర ఉన్న మార్గమధ్యలో హరితహారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు పెరిగి, ఈ దారివెంట వెళ్లే ప్రయాణికులు, వాహనదారులకు పచ్చని చెట్లు కనువిందు చేస్తున్నాయి. భగభగ మండే ఎండలో బాటసారులకు నీడ నిస్తున్నాయి. అప్పటి సర్పంచ్ బొట్ల సంధ్యరవి రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి, సంరక్షించడంలో ప్రముఖ పాత్ర వహించారని గ్రామస్తులు అంటున్నారు. మండలంలోని ముస్త్యాలపల్లి మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుంది. పల్లెప్రగతి ద్వారా నిజంగానే ప్రగతి సాధించామని గ్రామస్తులు చెబుతున్నారు.



రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటిస్తున్న సర్పంచ్ బొట్ల సంధ్య (ఫైల్)

గ్రామస్తుల సహకారంతోనే..



సర్పంచ్‌గా గెలిచిన తర్వాత మొదటగా రోడ్డుకు ఇరువైపులా హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామస్తుల సహకారంతో మొక్కలు నాటించాను. అప్పటి నుంచి వాటిని కాపాడే బాధ్యతను తీసుకున్నారు. దీంతో మొక్కలన్నీ నేడు వృక్షాలుగా మారి మాకు నీడనిస్తున్నాయి.

– బొట్ల సంధ్య, మాజీ సర్పంచ్ ముస్త్యాలపల్లి

అసత్య ఆరోపణలు మానుకోవాలి

శాయంపేట : కాంగ్రెస్ నాయకులపై బీఆర్‌ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలని మైలారం కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు మస్కే కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ జాబితా నుంచి 24 మందిని కాంగ్రెస్ నాయకులు తొలగించారని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపణలు చేయడం విడ్డూరమన్నారు. అధికారులు వెలువరించిన 60 మంది లబ్ధిదారుల జాబితాలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారు ఉన్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. పార్టీలకతీతంగా లబ్ధిదారుల ఎంపిక జరిగిందని, గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేయాల్సిన రుణాలు మైలారం గ్రామ బీఆర్‌ఎస్ నాయకుల నిర్లక్ష్యం వల్ల ఆలస్యమయ్యాయని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మండలానికి 10 దళితబంధు యూనిట్లు కేటాయించిన మైలారం గ్రామానికి ఒక్క యూనిట్ కూడా దళితులకు ఇప్పించని అసమర్థులని మండిపడ్డారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చొరవతో 60 మంది దళితులకు మొదటి విడతలో ఎస్సీ కార్పొరేషన్ రుణాలు వస్తున్నాయని మిగిలిన వారికి త్వరలో ప్రభుత్వం నుంచి మంజూరు చేసి ఇప్పిస్తామని లబ్ధిదారులు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. తమ ఉనికి కోసం గ్రామ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ నిరాధారమైన ఆరోపణలు చేస్తే ఉపేక్షించేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. నాయకులు మామిడిపల్లి సాంబయ్య, అరికిళ్ల సుధాకర్, మసికే ఐలయ్య, భూపాల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కుమార్

రామకృష్ణకు కార్పొరేషన్ పదవి ఇవ్వాలి



ఆత్మకూరు : కాంగ్రెస్ ఎస్సీ సెల్ హనుమకొండ జిల్లా చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు రాష్ట్రస్థాయి నామినేటెడ్ కార్పొరేషన్ పదవి ఇవ్వాలని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేశ్ డిమాండ్ చేశారు. మండలంలోని నాగయ్యపల్లెలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కే మార్క్స్ సంస్థ , రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు ఆరోగ్య సేవలను ఉచితంగా అందిస్తున్నారన్నారు. జిల్లాలో ప్రజాప్రతినిధుల గెలుపునకు కృషి చేశారన్నారు. సమావేశంలో అంబేడ్కర్ సంఘం జిల్లా నాయకుడు గిన్నారపు శ్రీకాంత్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సుదర్శన్, మాజీ ఉప సర్పంచ్ యాకయ్య మాజీ వార్డు మెంబర్ సాంబయ్య దళిత ప్రజా సంఘాల నాయకులు నవీన్, కట్టమల్లు, రాజేష్, రమేష్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

దామెర : బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి అన్నారు. బాల్యవివాహాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని తహసీల్దార్ కార్యాలయంలో, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ యువతికి 18, యువకుడికి 22 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహం చేయాలని అన్నారు. చిన్న తనంలోనే వివాహాలు చేయడం వల్ల కుటుంబ బాధ్యతల పట్ల అవగాహన లోపంతో సమస్యలు ఎదురవుతాయని పేర్కొన్నారు. శారీరక ఎదుగుదల లేకుండా కాన్పుకావడం వలన తల్లి, పిల్ల అనారోగ్యాలకు గురవుతారని వెల్లడించారు. బాల్య వివాహాలు నిర్మూలించి ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఎస్సై కొంక అశోక్ మాట్లాడుతూ బాల్య వివాహాలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లకావత్ రాజేష్ కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి, డీటీ ఖురేషి, ఆర్‌ఐలు సంపత్, భాస్కర్ రెడ్డి, అంగన్‌వాడి సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత



సంగెం: ఆశాలపల్లిలోని కోళ్లఫామ్‌లో రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాకకు చెందిన గాదె కిరణ్‌కుమార్ ఆశాలపల్లిలో కోళ్లఫామ్ నిర్వహిస్తున్నాడు. అందులో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసి కోళ్లకు దాణాగా వాడుతున్నట్లు సమాచారం రావడంతో సంగెం పోలీసులతో కలిసి శుక్రవారం దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో రూ.82,836 విలువైన 31.86 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు వివరించారు. నిందితుడు కిరణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని, ఖిలావరంగల్ మండలం గాడిపల్లికి చెందిన రాజు తప్పించుకున్నట్లు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం సంగెం పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, సంగెం ఏఎస్సై సీతారాములు, కానిస్టేబుల్ మురళీమోహన్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

సంగెం: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వీఆర్ఎన్ తండాకు బానోత్ బాలు(42)కు ప్రమీలతో 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి నవ్య, వెంకటేశ్‌లు సంతానం. కూతురు నవ్య పెళ్లి జరిపించారు. కుమారుడు చదువుకుంటున్నాడు. మద్యానికి బానిసైన బాలు తరచూ భార్య ప్రమీలతో గొడవ పడి కొడుతుండడంతో కొంతకాలం క్రితం ప్రమీల పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందిన తర్వాత పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నెల 15న బాలు పురుగుల మందు తాగడంతో గమనించిన స్థానికులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా గురువారం రాత్రి మృతి చెందాడు. బాలు తల్లి సుకిలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

గ్రామసభల్లో కమిటీలను నియమించాలి

ఐనవోలు: గ్రామసభ నిర్వహించి ఇందిరమ్మ కమిటీలను నియమించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌కు బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు కొరకు ప్రభుత్వం కమిటీలను వేయాలని నిర్ణయించి జీఓ వెలువరించిందన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా ప్రతి గ్రామంలో గ్రామ సభ నిర్వహించి పార్టీలకతీతంగా గ్రామస్తుల ఆమోదంతో కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎటువంటి గ్రామసభలు ఏర్పాటు చేయకుండా కేవలం కాంగ్రెస్ కార్యకర్తల పేర్లను కమిటీల్లో ప్రతిపాదించి ఎంపీడీఓకు అందజేసి.. ఇవే ఇందిరమ్మ కమిటీలని ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని వాపోయారు. పార్టీలకతీతంగా కమిటీలు ఏర్పాటు చేస్తేనే నిజమైన లబ్ధిదారుడికి లబ్ధి చేకూరుతుందని ఆరోపించారు. వినతిపత్రం అందజేసిన వారిలో తాటికాయల కుమార్, కాటబోయిన అశోక్, దుప్పెల్లి రాజు, పట్టాపురం ఎల్లాగౌడ్, చందు, ఉడుత రవి, మామిండ్ల సంపత్, బోయినపల్లి సోమేశ్వర్‌రావు, అశోక్, రాజు తదితరులు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఐనవోలు: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ, గురుకుల ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ బాధ్యులు బ్రహ్మచారి, విజయ భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్, పరమేశ్వర్‌లు కోరారు. శుక్రవారం మండలంలోని గురుకుల పాఠశాల, పున్నేలు, నందనం, కక్కిరాలపల్లి, మరియపురం, పంథిని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి ఓటరు నమోదు ఫారాలను పంపిణీ చేశారు. ముందుగా ఎంఈఓ పులి ఆనందంకు ఓటరు నమోదు ఫారం అందజేసి ప్రారంభించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి మళ్లీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని కోరారు.



ఓటరు నమోదు ఫారాలను అందజేసిన టీఎస్ యూటీఎఫ్ నాయకులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం విడుదల చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖమంత్రిని నియమించాలని సూచించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పవన్‌కుమార్, అభిషేక్, సందీప్, రాజ్‌కుమార్, ప్రవళిక, శిరీష, మానస, అనూష తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంద శ్రీకాంత్

ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం

- అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి
- కొత్తకొండలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఎల్కతుర్తి : ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందని అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 154 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఈ యేడు సన్న రకాలకు ప్రభుత్వం ప్రోత్సాహకంగా రూ.500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. ఐకేపీ ప్యాడీ సెంటర్ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. కేవలం ఐకేపీ, పీఏసీఎస్ సెంటర్లలో విక్రయించిన ధాన్యానికి మాత్రమే బోనస్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఐకేపీ సెంటర్‌లో కాకుండా ప్రైవేట్‌గా అమ్ముకునే రైతులకు బోనస్ వర్తించదని వెల్లడించారు. రైతులు దళారుల మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కానున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 1లక్షా 60వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించనున్నట్లు అంచనా ప్రకారం తెలిపారు. అంతకుముందు కొత్తకొండ వీరభద్రస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించారు. పిల్లల బరువు, అందజేస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. పిల్లలకు అందిస్తున్న స్టాక్ వివరాలను అడిగి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఆర్‌డీఓ పీడీ నాగపద్మజ, ఏపీడీ శ్రీనివాస్, డీపీఎం ప్రకాష్, ఎంపీడీఓ వీరేశం, డిప్యూటీ తహసీల్దార్ సూర్య, ఏఓ ఎల్. పద్మ, ఏపీఎం దేవానంద్, సీసీలు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన మండల నాయకులు



టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేలేరు : టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌ను వేలేరు కాంగ్రెస్ ఇన్‌చార్జి మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ ఆధ్వర్యంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు పీసీసీ చీఫ్ దృష్టికి నియోజకవర్గంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను తీసుకెళ్లారు. పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు కాకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెంట వచ్చిన నాయకులకే ప్రాధాన్యత ఇస్తున్నాడని, తమకు ఎమ్మెల్యే కడియం పర్యటన వివరాలు కూడా చెప్పడం లేదని వివరించారు. ఇందిరమ్మ కమిటీలో కూడా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ అధికారంలోకి రావడం కోసం కేసులు భరించి, ఆర్థికంగా కష్టనష్టాలకోర్చి పదేళ్ల పాటు పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు గుర్తింపునివ్వాలని కోరారు. గ్రామాల్లో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకుల పెత్తనమే నడుస్తుందని తమను పూర్తిగా అణిచివేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కలిసిన వారిలో వివిధ గ్రామాల గ్రామశాఖ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, తెల శ్రీకాంత్, శ్రీపతి రమేష్, జరుపుల రమేష్, దేవేందర్ రెడ్డి, సంపత్, రణధీర్ రెడ్డి, సలీం మాలిక్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

ఐనవోలు: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలంలోని వెంకటాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుతున్న విద్యార్థిని కృతిక ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం తాళ్లపల్లి రమేశ్ తెలిపారు. హనుమకొండ జేఎన్ఎస్ క్రీడా మైదానంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో కృతిక అద్భుతమైన ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషకరం అన్నారు. శుక్రవారం పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు పద్మావతి, ఉపాధ్యాయులు కృతికను అభినందించారు. ఈ నెల 19,20 తేదీల్లో ఇన్‌ఫాంట్ జీసస్ హైస్కూల్‌లో జరిగే పోటీల్లో కృతిక పాల్గొననున్నట్లు చెప్పారు.



కృతికను అభినందిస్తున్న పద్మావతి, ఉపాధ్యాయులు

బాధిత కుటుంబాలకు పరామర్శ



ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



సాదలి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రఘుపతి రెడ్డి, తదితరులు

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు వలపదాసు చంద్రమౌళికి ఇటీవల ఓపెన్‌హార్ట్ సర్జరీ జరిగింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శుక్రవారం చంద్రమౌళిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన జర్నలిస్టు గన్ను సంతోష్ తల్లి ధనలక్ష్మి, పత్తిపాకకు చెందిన దామెర మల్లయ్య, సాధోనిపల్లెకు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు జంగా సమ్మయ్య తల్లి సాంబలక్ష్మిలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మల్లయ్య కుటుంబ సభ్యులకు రూ. 2వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అలాగే మండలంలోని ప్రగతి సింగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బోయిని పైడి తండ్రి సాదలి శుక్రవారం జరిగిన ప్రథమ సంవత్సరీకం కార్యక్రమానికి కాంగ్రెస్ జిల్లా నాయకుడు బోనపల్లి రఘుపతిరెడ్డి పాల్గొని సాదలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట పీఏసీఎస్ డైరెక్టర్ ఎలమంచి జయపాల్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు వైద్యుల ఆదిరెడ్డి, నాయకులు గోగుల జయపాల్ రెడ్డి, మోరే శ్రీనివాస్, రాజయ్య, కుమారస్వామి, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు కష్టపడి లక్ష్యంతో చదవాలి

సంగెం: విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యంతో కష్టపడి చదివి ఉజ్వల భవిష్యత్‌ను రూపొందించుకోవాలని ఎన్పీడీసీఎల్ మాజీ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు అన్నారు. శుక్రవారం తన స్వగ్రామమైన కాపులకనిపర్తిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏఎంఆర్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న వనరులను వినియోగించుకుని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో సిరి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ డాక్టర్ పరికి సుధాకర్, ఎస్ఎంసీ సభ్యులు తోటకూర మమత, హెచ్‌ఎం పాల్గొన్నారు.



పాఠశాలలో మాట్లాడుతున్న గోపాల్‌రావు